
సాక్షి అనకాపల్లి

శనివారం ; 19 ; జులై ; 2025



సింహవల్లీ తాయారుకు తిరువీధి

సింహాచలం: అప్పన్న ఆలయంలో కొలువైన సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం విశేషంగా తిరువీధి జరిగింది.



నియామకం

మద్దిలపాలెం: ఏయూ ఇంజనీరింగ్ కళాశాల, కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు చిట్టిబాబు బీవోఎస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 35-36 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 26.4 నుంచి 27 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

- ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

అనకాపల్లి: జిల్లాలో బాల్య వివాహాలు అరికట్టడంలో బాల్య వివాహ రహిత కమిటీని 11 మంది సభ్యులతో నియమించామని, 18 ఏళ్లలోపు వారికి వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక గవరపాలెం బాలికోన్నత పాఠశాలలో బాల్య వివాహ రహిత వార్డు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 గురించి వివరించారు. దీనిపై అవగాహన కలిగి ఉండాలని కమిటీ సభ్యులకు సూచించారు. ప్రతి బాలిక చదువుకునేటట్టు ప్రోత్సహించాలని, తల్లిదండ్రులకు చట్టాల పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ఎమర్జెన్సీ సమయంలో 112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 108, 100కి కాల్ చేసే విధంగా తల్లిదండ్రులకు పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వంశీప్రియ, గ్రామ రెవెన్యూ ఆఫీసర్ జి.ప్రసాద్, హెచ్ఎం పి.జగన్నాథరావు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కోసం 13 కి.మీ. నడక



సరకులతో కావిడి మోస్తూ నిరసన తెలియజేస్తున్న గిరిజనులు

రావికమతం: రేషన్ సరకుల కోసం 13 కిలోమీటర్లు నడుస్తున్నామని, జెడ్.జోగుంపేట కేంద్రంగా జీసీసీ డిపో ఏర్పాటు చేయాలని చీమలపాడు పంచాయతీ గిరిజనులు డిమాండ్ చేశారు. కావిడిలో సరకులు మోస్తూ వారు శుక్రవారం నిరసన తెలియజేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ విధానానికి కూటమి సర్కార్ మంగళం పాడటంతో చీమలపాడు గిరిజనులు తీవ్ర అ వస్థలు పడుతున్నారు. సరైన రోడ్డు సదుపా యం లేకపోవడంతో తలపై రేషన్ సరకుల మూట మోస్తూ అష్టకష్టాలు పడుతున్నారు. ఈ పంచాయతీ పరిధిలో కల్యాణపులోవ గ్రామంలో జీసీసీ రేషన్ డిపో ఉంది. దీని పరిధిలో జెడ్.జోగుంపేట, పెదగురువు, రాయపాడు, రొచ్చుపణుకు, తాటిపర్తి, గంగంపేట, నేరెడుబంద, అజేయపురం, కడగడ్డ, బంగారుబందలు గ్రా మాలున్నాయి. 612 కార్డులు కలిగిన లబ్ధిదారులున్నారు. వీరు కాలినడకన కొండలు, వా గులు, గుట్టలు దాటుకొని 13 కిలోమీటర్లు న డిచి కల్యాణపులోవ వచ్చి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తోంది. జెడ్.జోగుంపేట కేంద్రంగా జీసీసీ పాయింట్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు.

'మధ్యాహ్న భోజన' కార్మికుల

ఆకలి కేకలు

- 4 నెలలుగా అందని వేతనాలు.. విడుదల కాని మెస్ చార్జీలు
- నిర్వాహకులకూ భారంగా మధ్యాహ్న భోజన పథకం
- అప్పు చేసి ఎన్నాళ్లు నడపాలని ఆవేదన
- చీమ కుట్టినట్టయినా లేని కూటమి సర్కారు



డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మిడ్ డే మీల్స్ వంట కార్మికులు(ఫైల్)

సాక్షి, అనకాపల్లి: చాలీచాలని వేతనాలు.. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కారణంగా పెట్టిన పెట్టుబడి రాక మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. వీటికి తోడుగా నాలుగు నెలలుగా వేతన బకాయిలు రాకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు నిర్వహణ మరింత భారంగా మారింది. కిరాణా దుకాణాల నుంచి సరకులు అరువు తెచ్చి భోజనం వండుతున్న పరిస్థితులున్నాయి. నెలల తరబడి అరువు ఇవ్వడానికి కిరాణా షాపు యజమానులు నిరాకరించడంతో పలుచోట్ల బంగారు వస్తువులు తాకట్టు పెట్టి మధ్యాహ్న భోజన పథకం నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే పరిస్థితులు కొనసాగితే భవిష్యత్తు కష్టతరం అవుతుందంటూ ఇప్పటికే డీఈవో, ఏఈవో కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరసనలు కూడా నిర్వహించారు. అయినా ప్రభుత్వం తీరులో మార్పు రాలేదు. గౌరవ వేతన బకాయిలు, మెస్ బిల్లుల చెల్లింపు గురించి పట్టించుకోవడం లేదు.

మొత్తం రూ.8 కోట్ల బకాయిలు

జిల్లా విద్యాశాఖ గణాంకాల ప్రకారం మధ్యాహ్న భోజనానికి నెలకు రూ.2.18 కోట్లు ఖర్చు చేస్తున్నారు. వీటిలో ప్రాథమిక పాఠశాలలకు రూ.40.65 లక్షలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.55.43 లక్షలు, ఉన్నత పాఠశాలలకు రూ.42.15 లక్షలు, ప్రాథమిక పాఠశాలలకు అదనపు మెనూ చార్జీలు రూ.3.2 లక్షలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు అదనపు మెనూ చార్జీలు రూ.2.71 లక్షలు, హైస్కూళ్లకు అదనపు మెనూ చార్జీలు రూ.2.06 లక్షలు, సీసీహెచ్-1000కు రూ.24 లక్షలు, సీసీహెచ్-2000కు రూ.24.14 లక్షలు కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు గత మూడు నెలలుగా, జూనియర్ కళాశాలల్లో నాలుగు నెలలుగా వేతనాలు, మెస్ చార్జీలు చెల్లించలేదు. ఇంతవరకు మొత్తం రూ.8 కోట్ల బకాయిలు ఉన్నాయి.

పేరెంట్స్ మీటింగ్స్‌తో అదనపు భారం

మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఇప్పటికే నాలుగు నెలలుగా బకాయి పడిన పరిస్థితుల్లో యోగా డే, పేరెంట్స్ మీటింగ్స్ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు సైతం భోజనం పెట్టాల్సి రావడంతో మరింత భారం పడిందని వాపోతున్నారు. పేరెంట్స్ మీటింగ్‌లకు వచ్చే వీఐపీలకు ఒక మెనూ, విద్యార్థుల తల్లిదండ్రులకు ఒక మెనూ, విద్యార్థులకు ఒక మెనూ వండిస్తున్నారు. విద్యార్థుల రోజువారి మెనూ ఖర్చుతో పోల్చితే పేరెంట్స్ మీటింగ్ ఒక్క రోజుకు మూడు రెట్లు ఖర్చవుతుంది. ఒకవైపు శ్రమ, మానసిక ఒత్తిడి.. మరోవైపు ప్రభుత్వం ఇచ్చే చార్జీలకు మూడింతల ఖర్చుతో సతమతమవుతున్నారు.

> జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, హెల్పర్ల సంఖ్య **2,064**
>
> వారికి వేతనాలు, మెస్ చార్జీల బకాయి రూ. **8** కోట్లు

ఐదుగురి జీతం 8 మంది పంచుకుంటాం

నేను చోడవరం బాలికల హైస్కూల్లో గత 23 ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఈ స్కూల్లో మొత్తం 8 మంది పనిచేస్తున్నాం. కానీ జీతం వచ్చేది ఐదుగురికే. అదే అందరం పంచుకుంటాం. ఇప్పుడు స్కూల్స్ రేషనలైజేషన్ కారణంగా ఒక శానిటేషన్ వర్కర్, ఒక మిడ్ డే మీల్స్ వంట కార్మికుడి ఉద్యోగం కూడా పోయింది. విద్యార్థులు తగ్గిపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల ఉపాధి మరింత తగ్గనుంది. అంతో ఇంతో వచ్చే వేతనం కూడా బకాయి పెడితే ఎలా?

– గూనూరు వరలక్ష్మి, మిడ్ డే మీల్స్ వంట కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు

చార్జీలు పెంచాలి

మధ్యాహ్న భోజనం పథకం పెట్టినప్పటి నుంచి 20 ఏళ్లుగా ఇందులోనే పనిచేస్తున్నాను. నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం ఇచ్చే సొమ్ము ఏ మూలకూ సరిపోవడం లేదు. సగటున ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం పాఠశాలల్లో ఒక ప్లేటుకు రూ.5.90, జూనియర్ కళాశాలల్లో ప్లేటుకు రూ.8.57 ఇస్తుంది. కానీ మాకు రెట్టింపు ఖర్చవుతోంది. ప్లేటుకు రూ.15 నుంచి రూ.20 వరకు చెల్లిస్తేనే మాకు గిట్టుబాటు అవుతుంది.

–గండి రమణమ్మ, జోడుగుళ్ల, సబ్బవరం మండలం



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న కార్మికులు



డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతి పత్రం ఇస్తున్న మిడ్ డే మీల్స్ వంట కార్మికులు(ఫైల్)

21మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

అనకాపల్లి టౌన్: జిల్లా పరిధిలో గత ఐదు రోజులుగా ఐరిస్ హాజరు వేయని 21 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. ఈ నోటీసులు అందుకున్న వారిలో ప్రధానోపాధ్యాయులు, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

రిటైర్డ్ టీచర్‌కు కూడా..

మూడు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడికి కూడా ఈ షోకాజ్ నోటీసు అందడం విశేషం. గొలుగొండ మండలం సిహెచ్ నాగాపురంలో పనిచేసిన సెకండరీ గ్రేడ్ టీచర్ గజ్జలపు సత్యనారాయణ ఈ ఏడాది ఏప్రిల్ 30న రిటైరయ్యారు. ఈనెల 7వ తేదీ నుంచి 18 వరకు ఐరిస్ హాజరు వేయలేదని నోటీసు అందడంతో ఆయన తెల్ల మొహం వేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు



ఉద్యోగుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి సుబ్బలక్ష్మి

తుమ్మపాల: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగుల సమస్యలపై నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆమెతోపాటు కలెక్టరేట్ పరిపాలన అధికారి టి.విజయ్ కుమార్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఉద్యోగుల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ వారం ఉద్యోగుల గ్రీవెన్స్ డేలో 8 అర్జీలు నమోదయ్యాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

737లో భూముల సర్వే ప్రారంభం

- సంయుక్తంగా సర్వే చేపట్టిన ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు
- సర్వే అనంతరం వివరాలు వెల్లడిస్తామన్న ఏడీ గోపాలకృష్ణ



సర్వే చేస్తున్న ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు

మాకవరపాలెం: రాచపల్లి రెవెన్యూలోని 737 సర్వే నంబర్‌లో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. యరకన్నపాలేనికి, యలమంచిలి మండలం పెదపల్లికి మధ్యలో ఇటీవల మట్టిరోడ్డు వేసిన సంగతి తెలిసిందే. ఫారెస్ట్ భూమిలో రోడ్డు వేస్తున్నారంటూ కోటవురట్ల సెక్షన్ అధికారి వివేకానంద పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. ఈ నేపథ్యంలో గురువారం నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పరిశీలించి, ఈ రోడ్డు వేయడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. కానీ అనుమతులు ఎవరు ఇచ్చారు, ఏ నిధులతో వేస్తున్నారో తెలపాలని మీడియా ముఖంగా అధికారులను ప్రశ్నించారు. దీంతో శుక్రవారం ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా 737 సర్వే నంబర్ భూమిపై సర్వే ప్రారంభించారు. రెవెన్యూ విభాగం జిల్లా సర్వే ఏడీ గోపాలకృష్ణ, ఆర్డీవో వి.వి.రమణ సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ 737 సర్వే నంబర్‌లో మొత్తం 1605 ఎకరాల భూమి ఉందన్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ మ్యాప్‌లు, రికార్డుల ఆధారంగా పూర్తిస్థాయి సర్వే చేపట్టి సరిహద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. అయితే జంగిల్ అధికంగా ఉన్న కారణంగా కొంత సమయం పడుతుందన్నారు. సర్వే పూర్తి చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, నర్సీపట్నం ఫారెస్ట్ రేంజర్ రాకేష్ కుమార్, కోటవురట్ల సెక్షన్ అధికారి వివేకానంద, బీట్ అధికారి నూకరాజు, వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అశ్రద్ధ చూపితే కఠిన చర్యలు

కలెక్టర్ విజయ కృష్ణన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: వర్షాకాలం నేపథ్యంలో జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎంపీడీవోలు, లైన్ విభాగాల క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు అధికంగా ప్రబలే ప్రమాదం ఉండటంతో గ్రామాల్లో నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి పైపుల లీకేజీలను సరిచేయాలన్నారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాలను సచివాలయ సిబ్బంది సహకారంతో నిర్వహించాలన్నారు. వ్యాధుల నిర్ధారణ పరీక్షలు ముమ్మరంగా నిర్వహించి, నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. పురపాలక సంఘాల్లో యాంటీ లార్వా, ఫాగింగ్ ఆపరేషన్లు విస్తృతంగా చేపట్టి కాలువలు, డ్రైనేజీల్లో మందుల పిచికారీ చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీలు, వసతి గృహాల ప్రాంగణాల్లో గడ్డి, చెత్తను ఉపాధి హామీ పనుల్లో భాగంగా తొలగించాలన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల నిషేధం

స్వచ్ఛత కోసం క్లాప్ మిత్రులను నియమించి వారికి జీతాలు సమయానికి చెల్లించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికారులు రోజువారీ గ్రామాల్లో చేయాల్సిన పనులను సమర్థవంతంగా నిర్వర్తిస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉండదన్నారు. ఎటువంటి అశ్రద్ధను సహించబోమని హెచ్చరించారు. ఈ నెల 19న నిర్వహించనున్న స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి అధికారి తప్పకుండా పాల్గొనాలన్నారు. ఇకపై జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికార సమావేశాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. సాధ్యమైనంత వరకు పునర్వినియోగించదగిన పదార్థాలు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మంగళాపురం సచివాలయంలో వెనక్కి పంపించిన నకిలీ విత్తనాల బస్తాలు

నకిలీ.. మకిలి..

- మొలకెత్తని విత్తనాలపై రైతుల ఆగ్రహం
- ప్రైవేటు దుకాణాలతోపాటు రైతు సేవా కేంద్రాల్లోనూ నాణ్యత లేని విత్తనమే..
- న్యాయం చేయాలని కోరుతున్న అన్నదాతలు



వడ్డాదిలో రెండు బస్తాలు వేసినా మొలకెత్తని వరి ఆకుమడిని చూపుతున్న రైతు రాజు

బుచ్చెయ్యపేట: నాణ్యత లేని విత్తనాలు.. చిత్తశుద్ధి లేని ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం చెందుతున్నారు. మొలకెత్తని విత్తనాలు అంటకట్టి తమ జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు సహాయ కేంద్రాలకు వచ్చిన విత్తనాలు బాగులేవని అధికారులు వెనక్కు పంపేశారు. ప్రైవేటు దుకాణాల్లో కొని వేసిన విత్తనాలకు సైతం సరిగా మొలకలు రాకపోవడంతో కోపోద్రిక్తులైన రైతులు షాపులకు వెళ్లి గొడవ చేశారు. వడ్డాదిలోని ప్రైవేటు షాపులో కొనుగోలు చేసిన ఆర్‌జీఎల్ రకం వరి విత్తనాలు నాటకపోవడం వారి ఆవేదనకు కారణం. ఒక్కో బస్తాను రూ.1,250కి కొనుగోలు చేశారు. వరి విత్తనాలు వేసి 15 రోజులు దాటినా ఆకుమడి సరిగా నాటలేదని, నకిలీ విత్తనాలు అంటకట్టారని రైతులు బొబ్బాది రాజు, రావాడ ప్రసాద్, రావాడ సింహాచలం, వరహాలబాబు, వెలుగుల నూకరాజు, దాడి జగ్గారావు తదితర రైతులు ఆవేదన చెందుతున్నారు. నకిలీ విత్తనాలు సరఫరా చేయడంపై షాపు నిర్వాహకుడిని నిలదీశారు. వ్యవసాయ శాఖ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

విత్తనాలను వెనక్కు పంపిన వ్యవసాయ శాఖ

మంగళాపురం, విజయరామరాజుపేట రైతు సహాయ కేంద్రాలకు ప్రభుత్వం ఆర్‌జీఎల్ 2537 లాట్ నెంబర్ -003 రకం ధాన్యం విత్తనాలను 70 క్వింటాళ్లకుపైగా సరఫరా చేసింది. రైతులకు విత్తనాలు అందించక ముందే వీటి మొలక శాతాన్ని వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించారు. వారం రోజులు దాటాక కేవలం 40 నుంచి 50 శాతం మాత్రమే మొలక శాతం వచ్చింది. నకిలీ విత్తనాలుగా గుర్తించిన వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు తిరగబడతారని వాటిని అమ్మకాలు చేయలేదు. వరి విత్తనాల బస్తాలను తిరిగి ఏపీ సీడ్స్‌కి పంపించేశారు. తరవాత మరో లాట్ విత్తనాలను తీసుకొచ్చి రైతులకు విక్రయించారు. దీంతో పలువురు రైతులు ఆలస్యంగా ఆకుమడులు వేశారు. నకిలి విత్తనాలు సరఫరా చేసిన ఏపీ సీడ్స్ కంపెనీపైన, ప్రైవేటు విత్తన వ్యాపారులపై తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

చర్య తీసుకోవాలి



ప్రైవేటు దుకాణంలో వరి విత్తనాలు నాణ్యంగా ఉంటాయని వడ్డాది షాపులో రెండు బస్తాల ఆర్‌జీఎల్ రకం విత్తన బస్తాలు కొన్నాను. మొలక సరిగా రాలేదు. నకిలీ విత్తనాలు విక్రయించారు. ఇంట్లో ఉన్న ధాన్యాన్ని తీసుకెళ్లి రెండోసారి వేసుకోగా బాగానే నాటింది. ఆ వ్యాపారిపై అధికారులు చర్యలు తీసుకుని మాకు పరిహారం అందించి ఆదుకోవాలి.

– రావాడ ప్రసాద్, వడ్డాది

పట్టించుకునేవారు లేరు



వడ్డాదిలో ప్రైవేటు విత్తన దుకాణంలో రెండు బస్తాల ఆర్‌జీఎల్ రకం విత్తనాల బస్తాలను రూ, 2,500కు కొనుగోలు చేశాను. విత్తనాలు వేసి 15 రోజులు దాటినా సరిగా మొలక రాలేదు. ప్రైవేటు షాపు నిర్వాహకుడిని అడిగినా, వ్యవసాయశాఖ సిబ్బందికి చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు న్యాయం చేయాలి.

– బొబ్బాది రాజు, వడ్డాది

ప్రభుత్వమే నకిలీ విత్తనాలు ఇస్తే ఎలా?



మా గ్రామ సచివాలయానికి వచ్చిన ఆర్‌జీఎల్ రకం విత్తనాలకు మొలక శాతం కట్టగా సరిగా నాటలేదు. దీంతో వ్యవసాయశాఖ సిబ్బంది నకిలీ విత్తనాల బస్తాలను తిరిగి పంపించేశారు. ప్రభుత్వం ఇలా చేయడం తగదు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. సకాలంలో విత్తనాలు అందకపోవడంతో ఆలస్యంగా వరి ఆకులు వేశాను.

– దుద్దు రమణ, మంగళాపురం

అపురూపం.. శాకంబరి అవతారం



అమ్మ రూపం అపురూపం.. శాకంబరిగా కూరగాయలు, పండ్లతో చేసిన అలంకారం నిరుపమానం.. ఆషాఢ మాసం బహుళ అష్టమి శుక్రవారాన్ని పురస్కరించుకుని గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు, ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, ఆలయ ప్రధాన అర్చకులు భోగారపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. – అనకాపల్లి

క్లుప్తంగా

అనకాపల్లి నుంచి వాడపల్లికి ప్రత్యేక బస్ సర్వీసు



- ప్రజా రవాణా శాఖాధికారి ప్రవీణ

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నుంచి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న వాడపల్లికి ప్రతి శనివారం ఒక ప్రత్యేక బస్సును నడపనున్నట్లు ప్రజా రవాణా శాఖాధికారి వి.ప్రవీణ తెలిపారు. స్థానిక డిపో ఆవరణలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రసిద్ధి గాంచిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని దర్శించుకునే భక్తుల కోసం ఈ సర్వీసు నడుపుతున్నట్టు చెప్పారు. శనివారం ఉదయం 4.30 గంటలకు బస్సు బయలు దేరుతుందన్నారు. తిరిగి మధ్యాహ్నం 2.15 గంటలకు అదే బస్సు బయలుదేరి సాయంత్రం 6.30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుందన్నారు. ఎక్కువ మందికి ప్యాకేజీ రూపంలో కూడా ఎప్పుడు కావాలంటే అప్పుడు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చేవారం నుంచి ఆన్‌లైన్ బుకింగ్ సేవలు కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ గౌరి పాల్గొన్నారు.

కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం-కిరండూల్ మధ్య నడిచే ప్రయాణికుల రైళ్ల భద్రతా పనుల నిమిత్తం ఆయా తేదీల్లో కోరాపుట్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు విశాఖపట్నం-కిరండూల్(18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 20వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కిరండూల్- విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు విశాఖపట్నం-కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ స్టేషన్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు కిరండూల్-విశాఖపట్నం(58502) పాసింజర్ కిరండూల్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

మురుగు కాలువలో నవజాత శిశువు మృతదేహం




సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

చోడవరం: కాల్వలో నవజాత శిశువు మృతదేహం కలకలం రేపింది. పొత్తిళ్లలో ఉండాల్సిన శిశువు మురుగు కాలువలో శవంగా కనిపించడం అందరినీ కలిచివేసింది. అంబేరుపురంలో శుక్రవారం శిశువు మృతదేహాన్ని స్థానికులు గమనించారు. ఎవరో జన్మనిచ్చి ఈ మురికి కాల్వలో పడేసిపోయి ఉంటారని భావిస్తున్నారు. చోడవరం పోలీసులకు సమాచారం అందడంతో అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, చోడవరం సీఐ అప్పలరాజు, వారితోపాటు ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించారు.

కూటమి నేతలూ.. ఇవేం పనులు?

- నాగాపురంలో శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేసిన టీడీపీ నాయకుడు
- తాజాగా పాఠశాలకు ఎదురుగా శ్మశానవాటిక నిర్మాణం
- ఆందోళనలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు



జిల్లా కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదు పత్రం



పాఠశాలకు ఎదురుగా శ్మశానవాటిక పనులు జరుగుతున్న దృశ్యం

గొలుగొండ: కూటమి నేతల ఆగడాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. ఇప్పటి వరకు బడి, గుడి, ప్రభుత్వ స్థలాలు ఆక్రయించిన నాయకులు.. ఇప్పుడు ఏకంగా శ్మశానవాటికను కబ్జా చేయడం అందర్నీ నివ్వెరపాటుకు గురిచేస్తోంది. గొలుగొండ మండలం నాగాపురంలో శ్మశానవాటికను ఆక్రమించి, దీనికి బదులుగా వేరే చోట పాఠశాలకు ఎదురుగా ప్రత్యేకంగా శ్మశానవాటిక నిర్మాణం చేపట్టడం ఆందోళన కలిగిస్తోంది. వివరాలిలా ఉన్నాయి.

నాగాపురంలో టీడీపీ నాయకుడుకు గ్రామ సరిహద్దులో సుమారుగా మూడు ఎకరాలు భూమి ఉంది. దానికి ఆనుకొని సుమారుగా ఎకరం భూమి వరకు గ్రామానికి సంబంధించి శ్మశానవాటిక స్థలం ఉంది. ఏళ్ల తరబడి ఇక్కడే దహన సంస్కారాలు చేస్తున్నారు. పదేళ్ల కిందట అంటే 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సదరు నాయకుడు వెంటనే తన భూమిని ఆనుకుని ఉన్న శ్మశానవాటిన స్థలానికి కంచె ఏర్పాటు చేసి ఆక్రమించాడు. గ్రామస్తులు ఏకమై కంచె తొలగించి మండల రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. టీడీపీ నేత ఆక్రమంచిన స్థలం శ్మశానవాటికగా నిర్ధారించారు.

మళ్లీ షరా మామూలు.!

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ 2014 పరిస్థితి వచ్చింది. శ్మశానవాటిక స్థలాన్ని టీడీపీ నాయకుడు ఆక్రమంచి కంచె వేయడంతో ప్రజలకు ఏం చేయాలో తెలియడం లేదు. ఎవరైనా గ్రామంలో చనిపోతే ఎక్కడ దహన సంస్కారాలు చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో నాగాపురం కూటమి నాయకులు కొత్త కథ తెరపైకి తెచ్చారు. శ్మశానవాటిక నిర్మాణం కోసం సుమారుగా రూ.10 లక్షలు నిధులు మంజూరయ్యాయని గ్రామంలో ప్రచారం చేశారు. సర్పంచ్ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడంతో తీర్మానం చేయాలని కోరారు. ఇప్పటి వరకు ఉన్న శ్మశానవాటికలో పనులు చేస్తానంటే తీర్మానం చేస్తానని సర్పంచ్ యలమంచి రఘురాం స్పష్టం చేశారు. దీంతో తీర్మానంతో పని లేకుండా గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని ఉన్న చెరువు గర్భంలో అధికారులు పనులు మొదలు పెట్టారు.

బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు

ప్రశాంత వాతావరణంలో ఉన్న పాఠశాల చెంతన శ్మశానవాటిక పనులు చేపట్టడడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అసలు పూర్వం నుంచి ఉన్న శ్మశానవాటికను విడిచిపెట్టి పాఠశాల పక్కన ఎలా ఏర్పాటు చేస్తారని గ్రామస్తులు నిలదీస్తున్నారు. లక్షలు విలువైన శ్మశానవాటిన స్థలాన్ని టీడీపీ నాయకుడికి కట్టబెట్టడానికి పాఠశాలకు 20 మీటర్ల దూరంలో చెరువు గర్భంలో పనులు చేయడంపై మండిపడుతున్నారు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

ఈ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు జూన్‌లో పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు కనీసం స్పందించలేదు. ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా శ్మశానవాటిక పనులు జరిగిపోతున్నాయి. చెరువు గర్భంలో పనులు చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోలేదు.



గొలుగొండలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతున్న సర్పంచ్ రఘురాం

కోర్టులో తేల్చుకుంటాం..

స్థానిక టీడీపీ నాయకుడి భూమికి ఆనుకొని ఉన్న శ్మశానవాటిక స్థలం కబ్జాపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశాం. ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు తెలియజేశాం. శ్మశానవాటినను ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని ఉన్న చెరువు గర్భంలో కూటమి నేతలకు వత్తాసు పలుకుతూ అధికారులు శ్మశానవాటిక పనులు చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించనున్నాం. అక్కడే తేల్చుకుంటాం.

– యలమంచిలి రఘురాం, నాగాపురం సర్పంచ్

టీడీఆర్ బాండ్లు వద్దంటే వద్దు



పూడిమడక రోడ్డు విస్తరణ నిర్వాసితులతో సమావేశమైన కలెక్టర్ విజయ కృష్ణన్

- స్పష్టం చేసిన పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులు
- నచ్చచెప్పేందుకు యత్నించిన కలెక్టర్
- అంగీకరించని నిర్వాసితులు.. అర్ధంతరంగా ముగిసిన చర్చలు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులతో శుక్రవారం కలెక్టర్ విజయ కృష్ణన్ నిర్వహించిన చర్చలు అర్ధంతరంగా ముగిశాయి. పరిహారాన్ని టీడీఆర్ బాండ్ల రూపంలో కాకుండా నేరుగా నగదు రూపంలో చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేయగా టీడీఆర్ బాండ్లను తీసుకొని రోడ్డు విస్తరణకు సహకరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. దీంతో చర్చలు ఎటువంటి పరిష్కారానికి నోచుకోకుండానే సమావేశం ముగించారు. శుక్రవారం సాయంత్రం అనకాపల్లి కలెక్టరేట్‌లో ఈ సమావేశం జరిగింది. ముందుగా వీఎంఆర్‌డీఏ అధికారులు టీడీఆర్ బాండ్లను తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ టీడీఆర్ బాండ్లు వద్దంటూ ముక్తకంఠంతో చెప్పారు. ఆర్ అండ్ బీ అధికారులు చేసిన తప్పులు, తక్కువ వాల్యూ కట్టడం, స్ట్రక్చర్ వాల్యూ తక్కువగా చూపడంతో పాటు 100 అడుగుల రోడ్డు తరువాత నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అందరి అభిప్రాయాలు విన్న కలెక్టర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తానని, టీడీఆర్ బాండ్లను తీసుకునేందుకు అంగీకరించాలని కోరారు. ఇందుకు నిర్వాసితులు ఒప్పుకోకపోవడంతో చర్చను నిలిపివేశారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం

అనకాపల్లి: ప్రతి ఒక్కరూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, చార్జీల భారాన్ని తగ్గించాలని వామపక్ష నాయకులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ కనుసన్నల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేట్‌పరం చేయాలని చూస్తుందని ఆరోపించారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై వేసిన రూ.842 కోట్లు భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చాక మాట మార్చిందన్నారు. ముందుగా రీచార్జ్ చేసుకోవడం, విద్యుత్ పీక్ అవర్‌ను బట్టి ధరలను నిర్ణయించడం, మీటర్ ఖర్చు సుమారుగా రూ.13 వేలు వరకు వినియోగదారులపై వేయడం దారుణమన్నారు. దళిత, గిరిజనులు, రైతులకు ఇప్పుడు ఇస్తున్న రాయితీలు భవిష్యత్‌లో ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్‌మీటర్లను పూర్తిగా వ్యతిరేకించాలని ఆగస్టు 4 వరకు విస్తృత ప్రచారం చేయాలని, ఆగస్టు 5న మండల కేంద్రాల్లో విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఆర్.శంకరరావు, కర్రి అప్పారావు, బి.పరమేశ్వరి, డి.డి.వరలక్ష్మి, బి.మాణిక్యం, జి.శ్రీరామ్, వై.ఎస్.భద్రం, మణికుమార్, తేలయ్యబాబు, రమేష్, సత్యనారాయణ, ఆర్.రాము, తదితరులు పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన వర్షం

కె.కోటపాడులో అత్యధికంగా 25.4 మి.మీ



చెరువును తలపిస్తున్న అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్

అనకాపల్లి టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి చెదురుమదురుగా వర్షం కురిసింది. కొద్దిసేపు ఎండా వర్షం, మరలా ఎండ కాసింది. కొద్ది రోజులుగా వేసవిని తలపించే విధంగా కాస్తున్న ఎండలతో వరి నారుమడులు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో కురిసిన వర్షం ఎంతో ఊరటనిచ్చింది. అయితే జిల్లాలో కె. కోటపాడులో అత్యధికంగా 25.4, నక్కపల్లిలో 5.2, పాయకరావుపేటలో 4.6, మాడుగులలో 4.4, గొలుగొండలో 3, యలమంచిలిలో 1.2 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

చెరువును తలపించిన అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్

కొద్దిపాటి వర్షానికే అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ చెరువును తలపించింది. శుక్రవారం మధ్యాహ్నం అరగంట పాటు కురిసిన వర్షానికి కాంప్లెక్స్‌లోకి నీరు చేరింది. ఇక్కడ ప్రవేశ మార్గంలో అడుగు పెట్టలేని విధంగా తయారైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డిపో ఎదుట భారీగానే వర్షం నిలిచిపోయి గ్యారేజీలో పనిచేసే ఉద్యోగులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ ప్రధాన రహదారికి తక్కువ ఎత్తులో కాంప్లెక్స్ ఆవరణ ఉండటంతోపాటు డ్రైనేజీలు సరిగా లేక నీరు పారడంలేదు. కాంప్లెక్స్‌కు నిత్యం గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, దినసరి కార్మికులు వస్తుంటారు. వీరందరూ వర్షం వస్తే కాంప్లెక్స్‌లో అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంటోంది.

టీడీపీ కార్యకర్తకు అందని 'తల్లికి వందనం'



బాధితుడు శివ

నక్కపల్లి: టీడీపీలో క్రియాశీలకంగా పని చేస్తున్న కార్యకర్త కుటుంబానికే తల్లికి వందనం పథకం మంజూరు కాలేదు. లేనిపోని నిబంధనలు పెట్టి ఈ పథకాన్ని ఎగ్గొట్టే ప్రయత్నాలే తప్ప పేద ప్రజలకు ఉపయోగపడేందుకు కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో రాజయ్యపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు, టీడీపీ కార్యకర్త వాసుపల్లి శివ కుమార్తె స్థానిక పాఠశాలలో చదువుతోంది. ఈమెకు తల్లికి వందనం పథకం వర్తించలేదు. మొదటి విడత జాబితాలో ఈమె పేరు లేకపోవడంతో ఆరా తీయగా.. 300 యూనిట్లు పైగా విద్యుత్ వినియోగం వల్ల వర్తించలేదని తెలిసింది. వెంటనే ఉపమాక ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయానికి వెళ్లి సమస్య వివరించగా 300 యూనిట్లు వినియోగించలేదని ఏఈ ఇచ్చిన పత్రంతో సచివాలయంలో గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేశానని శివ తెలిపారు. తన ఆధార్ నంబరుకు చినదొడ్డిగల్లులో ఒక సర్వీసు నంబరు యాడ్ అయిందని తెలిసిందన్నాడు. సదరు సర్వీసు నంబరు నుంచి తన ఆధార్ నంబరు తొలగించినట్టు చెప్పారు. మరోసారి గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేస్తే రెండో జాబితాలో కూడా తమ పేరు రాలేదన్నారు. మరోసారి ట్రాన్స్‌కో ఏఈని సంప్రదించగా తమ కార్యాలయంలో సమస్యను పరిష్కరించామని, ఇక తమకు సంబంధం లేదని ఏఈ సర్టిఫికెట్ ఇచ్చారన్నారు. కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయగా.. అక్కడ పరిశీలించి తన ఆధార్ నంబరుపై రెండు విద్యుత్ సర్వీసు నంబర్లు యాడ్ అయి ఉన్నాయని, మీకు తల్లికి వందనం వర్తించదని సమాధానం చెబుతున్నారని శివ ఆవేదన వ్యక్తం చేశాడు. అనవసర నిబంధనలు పెట్టి ఈ పథకాన్ని అర్హులైన వారికి ఇవ్వకుండా ఎగ్గొట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అనుమానం వ్యక్తం చేశాడు.

మేడపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

మునగపాక: మండలంలోని తోటాడలో ప్రైవేటు స్కూల్ నిర్మాణంలో భాగంగా మేడపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం తైపురం గ్రామానికి చెందిన నక్కా భూలేక తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగానే శుక్రవారం తోటాడలో ప్రైవేటు స్కూల్ నిర్మాణంలో భాగంగా పనులు చేస్తుండగా మేడపై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు.. మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎల్‌ఐసీ ఏజెంట్ మృతి



మృతుడు రాజుబాబు

మాడుగుల రూరల్: విద్యుదాఘాతానికి గురై ఓమ్మలి గ్రామానికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ బొద్దాపు రాజుబాబు(55) శుక్రవారం అవురువాడలో మృతి చెందారు. స్థానిక ఎస్‌ఐ జి.నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజుబాబు అతని భార్య లక్ష్మి, కుమార్తైతో కలిసి అవురువాడ గ్రామంలో తనకు చెందిన పామాయిల్ తోటలో ఐరన్ గొట్టంతో చేసిన కత్తితో గెలలు కోస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఆ గొట్టం పైన ఉన్న విద్యుత్ మెయిన్ లైనుకు తాకడంతో రాజుబాబు విద్యుత్ షాక్‌కు గురై తోటలో కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యుల సహకారంతో కింతలి పీహెచ్‌సీకి తీసుకెళ్లగా.. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రాజుబాబు భార్య లక్ష్మి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజుబాబుకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తెకు వివాహం కాగా, ఇద్దరు కుమార్తెలు చదువుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దివ్యాంగుల బోసి గేమ్ కోచ్‌గా మహాలక్ష్మినాయుడు



రావికమతం: జాతీయ స్థాయి దివ్యాంగుల బోసి గేమ్ క్రీడా పోటీల్లో రాష్ట్ర బాలుర జట్టుకు కోచ్‌గా మేడివాడ జెడ్పీ హైస్కూల్ అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడును నియమించారు. జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ బోసి గేమ్ క్రీడా పోటీలు ఈ నెల 24 నుంచి 28 వరకూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బిలాస్‌పూర్‌లో జరగనున్నాయి. రాష్ట్రం నుంచి బోసీ గేమ్ పోటీలకు బాలురు విభాగంలో ఆరుగురు, బాలికల విభాగంలో ఆరుగురు ఎంపికయ్యారు. ఏపీ నుంచి పాల్గొనే బాలికల జట్టులో కొమిర గ్రామానికి చెందిన నక్కరాజు బాల సరస్వతి ఎంపికయ్యారు. దివ్యాంగుల బాలుర విభాగంలోని ఆరుగురు క్రీడాకారులకు మహాలక్ష్మినాయుడు శిక్షణ ఇవ్వనున్నారు. కోచ్‌గా ఎంపికైన మహాలక్ష్మినాయుడును మేడివాడ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వంకాయల రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్టు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని ఫూల్‌బాగ్ రోడ్డు జంక్షన్ వద్ద రూ.10 వేల విలువ చేసే రెండు కేజీల గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ టి. విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధికి చెందిన మంగళగిరి దుర్గా వరప్రసాద్, మండలంలోని రామాపురానికి చెందిన మాదాసు వందన్ సాయిఫణిశ్రీ ఈ నెల 17న ఫూల్‌బాగ్ రోడ్ వాటర్ ట్యాంక్ వద్ద గంజాయి ప్యాకెట్లు అధిక ధరకు అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. సమాచారం మేరకు ఎస్‌ఐ డి. ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి గంజాయి స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్ట్ చేశారు. వారిని కోర్టుకు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

సీఆర్‌పీలకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలి



జయప్రకాష్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఆర్‌పీల యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న హెచ్‌ఆర్ పాలసీని విద్యాశాఖలో పని చేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ)కు కూడా వర్తింపజేయాలని సీఆర్‌పీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.శంకరరావు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని కార్యాలయంలో క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్ జిల్లా అధికారి డాక్టర్ రోణంకి జయప్రకాష్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్లుగా విద్యా వ్యవస్థలో తీసుకొచ్చినా అనేక కార్యక్రమాల అమలులో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించామన్నారు. అయినా వేతనాల విషయం లో వివక్షకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌కు సమానమైన విద్యార్హత ఉన్నప్పటికీ రూ.23,500 జీతంతో పని చేస్తూ ఎన్నో అవస్థలు పడుతున్నామని చెప్పారు. పీఆర్సీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీలో వెయిటేజీ కల్పించాలని, జిల్లా కమిటీల ద్వారా రోస్టర్ కం మెరిట్ ప్రాతిపదికన ఎంపికైన తమను సర్వీసును పరిగణనలోకి తీసుకొని స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో రెగ్యులర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు పి.నరసింహమూర్తి, ఎం.వి.వి.ఎన్.పద్మజ, ఎస్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ ఫెలోషిప్‌కు ధర్మిరెడ్డి ప్రసాద్ ఎంపిక



అచ్యుతాపురం రూరల్ : అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) దేశంలో వివిధ పరిశ్రమల అనుసంధానంతో అందిస్తున్న ఇండస్ట్రీ ఫెలోషిప్‌నకు స్థానిక ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సీ డాక్ పూణే ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, సూపర్ కంప్యూటింగ్, క్వాంటం కంప్యూటింగ్‌లో సంవత్సర కాలం శిక్షణ పొందుతానన్నారు. శిక్షణ సమయంలో నెలకు లక్ష రూపాయలు ఫెలోషిప్ అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

చేప పిల్లల విడుదలపై వివాదం



చైర్మన్, మాజీ చైర్మన్‌తో మాట్లాడుతున్న గొలుగొండ ఎస్‌ఐ రామారావు

గొలుగొండ: రావణాపల్లి జలాశయంలో చేప పిల్లల విడుదలపై రెండు వర్గాల మధ్య శుక్రవారం వివాదం చెలరేగింది. ప్రస్తుత చైర్మన్ నక్కా రమణ, మాజీ చైర్మన్ పోకనాటి శ్రీనివాస్ వర్గీయుల మధ్య జలాశయం వద్ద ఘర్షణ తలెత్తడంతో ఎస్‌ఐ రామారావు రెండు వర్గాల నాయకులతో సమావేశం నిర్వహించి ఎటువంటి గొడవులు జరగకుండా చర్యలు తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ప్రస్తుత చైర్మన్ ఎటువంటి తీర్మానాలు లేకుండా ఏకపక్షంగా జలాశయంలో చేప పిల్లలు వదలడంపై మరో వర్గం ఆరోపణలు చేస్తుంది. మాజీ చైర్మన్ శ్రీనివాస్ వర్గీయులు, కొంతమంది జాలర్లు శుక్రవారం మళ్లీ జలాశయంలో చేప పిల్లలు విడుదల చేయడం కోసం చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రస్తుత చైర్మన్ రమణ ఎస్‌ఐ రామారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ జలాశయం వద్దకు చేరుకుని వివాదం జరగకుండా చర్యలు చేపట్టారు. అనుమతులు ఉంటేనే తప్ప జలాశయంలో చేప పిల్లలు విడుదల చేయరాదని ఎస్‌ఐ హెచ్చరించారు.

క్లుప్తంగా

స్కేటింగ్ పార్కుకు గేటు ఏర్పాటు



స్కేటింగ్ పార్కు ప్రవేశ మార్గం వద్ద ఏర్పాటు చేసిన గేటు

సాక్షి ఎఫెక్ట్..

అనకాపల్లి టౌన్: పట్టణంలోని రింగ్‌రోడ్ లక్ష్మీనారాయణ నగర్‌లో స్కేటింగ్ పార్కులో కనీస వసతులు కరువయ్యాయని ఈ నెల 17న 'సాక్షి' దినపత్రిక కథనం ప్రచురితమైంది. ఇక్కడ కుర్చీలు విరిగిపోయాయి. ప్రవేశ మార్గం గేటు విరిగిపోతే పక్కన్న పడేశారు. ఈ అంశాలపై వచ్చిన కథనానికి స్పందించిన ఇంజనీరింగ్ అధికారులు గేటుకు కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి ప్రవేశ మార్గం వద్ద ఏర్పాటు చేశారు. పార్కులో విరిగిన బెంచీలు మాత్రం వదిలేశారు. ఇవి అడ్డుగా ఉన్నందున తొలగించాలని వాకర్స్, స్కేటర్స్ కోరుతున్నారు.

రేపు మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లి/టౌన్: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని తగరంపూడి గ్రామంలో ఈ నెల 20న మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ సమస్త జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలని, మొక్కలను నాటి వాటి పర్యవేక్షణ చేయడం వల్ల ప్రతి వ్యక్తి పరిశుభ్రమైన గాలిని పీల్చి ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు గ్రామంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో పర్యావరణానికి పనికొచ్చే వివిధ రకాల మొక్కలను నాటుతున్నట్లు పేర్కొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కశింకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనుందని ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కశింకోటలో వర్షం

కశింకోట: మండలంలో శుక్రవారం వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై కురిసిన వర్షం వల్ల వాతావరణం చల్లబడింది. కొద్ది రోజులుగా ఎండ వేడిమితో సతమతమవుతున్న ప్రజలు కాస్త ఊరట చెందారు.

నేడు మెగా జాబ్‌మేళా

చోడవరం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కాలేజీ ఆవరణంలో ఈనెల 19వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగులంతా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 89 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,490	4,700
రెండో రకం	3,480	3,500
మూడోరకం	3,400	3,450

అనకాపల్లి సినిమాలు

రాజా	: మై బేబీ
సత్యనారాయణ స్క్రీన్-1	: జూనియర్
సత్యనారాయణ స్క్రీన్-2	: కన్నప్ప
పర్తిసాయి	: ఓ భామ అయ్యో
రామ షిర్డీసాయి	: కొత్తపల్లిలో ఒకప్పుడు
వెంకటేశ్వర	: మిస్టర్ రెడ్డి
శ్రీ సత్య	: ఏమాయ చేసావె
రామచంద్ర	: 3 బీహెచ్‌కే

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-20, బీ పాజిటివ్-10, ఓ పాజిటివ్-28, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

వరుణుడు కరుణించక... విత్తనం మొలకెత్తక

- చినుకు కోసం ఎదురు చూస్తున్న రైతులు
- 20 రోజులుగా మట్టిలోనే మగ్గిపోతున్న వరి గింజలు
- తీవ్ర ఎండలకు ఎండిపోతున్న నారు చిగుర్లు



తీవ్ర ఎండకు ఎండిపోతున్న వరి ఆకుమడులు



ఎండిపోతున్న వరినారు చిగుర్లు

తుమ్మపాల: ఈ ఏడాది విభిన్న వాతావరణం పలకరించింది. వేసవిలో విపరీతంగా వర్షాలు కురిసి ప్రజలను చల్లదనంపరిచింది. వర్షాకాలంలో వేసవిని తలపించేలా ఎండలు విపరీతంగా కాస్తున్నాయి. 20 రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో ఖరీఫ్ వరి నారుమడులు వేసుకున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. తొలకరి ప్రారంభంతో మొదలైన ఖరీఫ్‌లో వరి విత్తనాలు చల్లుకున్నారు. ఇప్పుడవి మొలకెత్తక మట్టిలోనే ఎండిపోతున్నాయి. కొన్నింటిని పక్షులు ఏరుకుని ఆహారంగా పొట్ట నింపుకుంటున్నాయి. మరికొన్ని చోట్ల చిన్నపాటి పదునుతో మొలకెత్తిన చిగుర్లు తీవ్ర ఎండలకు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు వరుణుడి కటాక్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అధిక శాతం మట్టిలోనే ఎండుతున్న విత్తనాలు

అనకాపల్లి, కశింకోట మండలాల్లోని అన్ని గ్రామాల్లోను మెట్టు ప్రాంతాలతో పాటు పల్లం భూములు అధికంగానే ఉండటంతో అధిక శాతం రైతులు వరి సాగు చేస్తున్నారు. శారదా నది పరిసర ప్రాంతాల గ్రామాలు మినహా అన్ని గ్రామాలు వర్షాలపైనే ఆధారపడి సాగుకు సిద్ధమయ్యారు. అతి తక్కువ మంది రైతులు బోర్ల ఆధారంగా వరి పండిస్తూ ఉన్నారు. ఈ ఏడాది యధావిధిగా అన్ని గ్రామాల రైతులు తొలకరి చినుకులతోనే సిద్ధంగా ఉన్న ఆకుమడుల్లో వరి విత్తనాలు చల్లుకోగా, మరికొన్ని చోట్ల వెద పద్ధతిలో వరి నాట్లు చేసుకున్నారు. ఈ ఏడాది మార్చి నుంచే వర్షాలు బాగా కురవడంతో మంచి దిగుబడి వస్తుందన్న ఆశతో అందరు వరి సాగుకు సిద్ధమయ్యారు. తీరా ఇప్పుడు వానలు కురవకుండా తీవ్ర ఎండలు రావడంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయి. 20 రోజులుగా వరుణుడు పగబట్టినట్లు ఒక్క చినుకు కూడా కురవడం లేదు. దాంతో వరి విత్తనాలు మొలకెత్తక ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

శతశాతం వరి సాగుకు సిద్ధం

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వరి సాగుకు రైతులంతా సిద్ధమయ్యారు. అనకాపల్లి మండలంలో 6,500 ఎకరాలకు వ్యవసాయ అధికారులు 13,800 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేశారు. రైతులు పూర్తిస్థాయిలో విత్తనాలు తీసుకున్నారు. దీంతోపాటు బహిరంగ మార్కెట్లోనూ విత్తనాల కోసం పరుగులు తీసి వరి ఆకుమడులను సిద్ధం చేశారు. అనధికారిక లెక్కల ప్రకారం అనకాపల్లి మండలంలోనే 15,000 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ జరిగిందని అంచనా. దీన్ని బట్టి మండలంలో దాదాపు 8 వేల ఎకరాల వరి సాగుకు రైతులు సిద్ధమవ్వగా, అన్ని చోట్ల వరి విత్తనాలు మొలకెత్తని పరిస్థితులే ఉత్పన్నమయ్యాయి. ముఖ్యంగా పట్టణాన్ని ఆనుకున్న ఆవఖండం, తుమ్మపాల శంకరం, రేబాక, మామిడిపాలెం, మార్టూరు, కొండుపాలెం, కోడూరు, గొలగాం, కూండ్రం, కుంచంగి వంటి గ్రామాల్లో వరి ఆకుమడులు ఎండలకు తీవ్రంగా ఎండిపోతున్నాయి.

సాగునీటి కాలువ జాడేది...



ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామన్న కూటమి నాయకుల మాటలు బూటకంగా మిగిలిపోతున్నాయి. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే సాగునీటి కాలువలు మరమ్మతులు చేపట్టి నీరందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికి కాలువల మరమ్మతులు మొదలు కాలేదు. చెరువుల్లో చుక్కనీరు లేకుండా పోయింది. వర్షం లేక విత్తనాలు పక్షుల పాలవుతున్నాయి. సాగునీటి కాలువల ద్వారా నీరందెలా పాలకులు, అధికారులు చొరవ తీసుకోవాలి.

– కొణతాల హరినాథ్‌బాబు, అనకాపల్లి పట్టణం

20 రోజులుగా మొలకెత్తని విత్తనాలు



వరి నారుమడి తయారు చేసి 20 రోజుల క్రితం వరి విత్తనాలు వేశాను. ఒక్క చినుకు కూడా పడిన దాఖలా లేదు. విత్తనాలు భూమిలోనే మగ్గిపోతున్నాయి. ఎకరా భూమి శిస్తుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. విత్తనాలు చల్లి ఆకాశం వైపు ఎదురు చూస్తున్నాం. వరుణుడి కరుణ కోసం రైతులంతా కొండంత ఆశతో ఉన్నారు. లేదంటే విత్తనాలు నాటక నష్టపోవాల్సిందే..

– బద్ది వెంకటేష్, రేబాక గ్రామం

వీధుల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు



తాళ్లపాలెంలో పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: అన్ని వీధుల్లో క్రమం తప్పకుండా పారిశుధ్యాన్ని మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వి.వి. రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. తాళ్లపాలెం పంచాయతీ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను సేకరించి దాన్ని సంపద కేంద్రానికి తరలించి వర్మీ కంపోస్టు తయారీకి వినియోగించాలన్నారు. ఎరువును విక్రయించి పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. ప్రజలు పారిశుధ్య కార్యక్రమానికి తమ తోడ్పాటు అందివ్వాలన్నారు. తడి, పొడి చెత్తలను పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు అందజేయాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయరాదని, పరిశుభ్రత పాటించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ఎస్. సత్యారావు, పారిశుధ్య సిబ్బంది కార్యక్రమాలో పాల్గొన్నారు.

పాల సంఘం కార్యదర్శికి సత్కారం



పదవీ విరమణ చేసిన సత్యరామకృష్ణారావు దంపతులకు సత్కారం

కశింకోట: మండలంలోని గొబ్బూరు పాల ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శిగా పని చేసి పదవీ విరమణ పొందిన కీర్తి సత్యరామకృష్ణారావు దంపతులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాల సంఘం అధ్యక్షుడు పప్పల అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో పూలమాల వేసి దుశ్శాలువా కప్పి సన్మానించారు. సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ మేనేజర్ ఇ. శ్రీనివాస్, సూపర్‌వైజర్ సత్యనారాయణ, తాళ్లపాలెం మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణ రావు, కూటమి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు



అమలాపురంలో క్లోరినేషన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకోవడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించి వర్షాలు పడాల్సిన సమయంలో మండు టెండలు బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. రక్షిత మంచినీటి పథకాలు, బావులు, వీధులు, కాలువల్లో క్లోరినేషన్ పనులు ప్రారంభించారు. రక్షిత మంచినీటి పథకాల్లో బ్లీచింగ్ కలిపి నీటిని శుభ్రం చేయిస్తున్నారు. కాలువలు, రోడ్లపై పేరుకుపోయిన చెత్తను, మురుగును తొలగిస్తున్నారు. చందనాడ, అమలాపురం, పాటిమీద, మూలపర, బోయపాడు తదితర గ్రామాల్లో క్లోరినేషన్ పనులను ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. గ్రామాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. సచివాలయాల్లో ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులతో ఎవరైన ఇబ్బంది పడితే ప్రాథమిక చికిత్స అందించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



బి.నాగరాజు, తహసీల్దార్, పరవాడ

పరవాడ: అందరి సహకారంతో మండలంలో అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పరవాడ తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన బి.నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కరించే దిశగా పనిచేస్తానన్నారు. ముఖ్యంగా మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపడతానన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూముల ఆక్రమణ, అక్రమ కట్టడాలకు పూనుకుంటే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూముల దురాక్రమణ, అక్రమ కట్టడాలపై రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసి వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ బంజరు భూములు, కొండ ప్రదేశాలు, చెరువులు, వాగులు, కాలువల్లో అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపితే గనులు, భూగర్భశాఖ సమన్వయంతో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ పరమైన సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని చెప్పారు.

పేదలపై కూటమి ప్రభుత్వం దండయాత్ర

- ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట రూ.15,486 కోట్ల భారం
- స్మార్ట్ మీటర్లు అమర్చితే తరిమికొట్టండి.. అన్న లోకేష్‌ను ఇప్పుడేం చేయాలి
- వేపగుంటలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఐ ఆందోళన




ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం సామాన్య, నిరుపేద వర్గాలపై దండయాత్ర చేస్తోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసరావు ఆక్షేపించారు. ఏడాది పాలనలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.15,486 కోట్ల భారాన్ని వేసిందని మండిపడ్డారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిరసనగా వేపగుంట కూడలి వద్ద సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలను అడ్డంగా దోచుకోవడానికే ఈ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై ఆదానీ కంపెనీతో తప్పుడు ఒప్పందం చేసుకుందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమర్చితే తరిమి కొట్టండి అని చెప్పిన మంత్రి లోకేష్‌ను ఇప్పుడేం చేయాలని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, ఉన్నవాటిని తగ్గిస్తామని తప్పుడు ప్రకటనలు చేసిన కూటమి పెద్దలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇప్పుడు ప్రజలను దారుణంగా మోసం చేశారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ మిత్రుడైన అదానీ ప్రాపకం కోసం అతని కంపెనీలకు లాభాలు అందించేందుకు ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నారని ఆరోపించారు. తాజాగా కూటమి ప్రభుత్వ స్మార్ట్ మీటర్ల నిర్ణయం వలన ప్రజలపై రూ.వేల కోట్ల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వలన ప్రజల నుంచి వసూలు చేసే చార్జీలకు అంతు లేకుండా పోతుందన్నారు. ప్రీపెయిడ్ రీచార్జి అయిపోతే ఆ రోజు ఆ ఇంట్లో విద్యుత్ లేనట్టేనని పేర్కొన్నారు. ఏ రకంగా చూసుకున్నా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రజలకు తీవ్ర నష్టమే ఏర్పడుతుందని, తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. జిల్లా సమితి సభ్యుడు వై.రాంబాబు, కార్యకర్తలు, ప్రజలు, పలువురు చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

సింహవల్లీ తాయారుకు తిరువీధి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువైన సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం విశేషంగా తిరువీధి జరిగింది. సింహవల్లీ తాయారు, సువర్ణ అమ్మవారి ఉత్సవ మూర్తులను పల్లకిలో వేంజేపచేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు. విశేష హారతులు అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చేది లేదు



రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న తహసీల్దార్ లక్ష్మి

బుచ్చెయ్యపేట: పరిశ్రమలకు వ్యవసాయ భూములు ఇవ్వబోమని మూడు పంచాయతీల రైతులు అధికారులకు తేల్చి చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు కోసం భూ సేకరణకు శుక్రవారం ఆర్.భీమవరం, మల్లాం, ఆర్.శివరాంపురం గ్రామాల్లో తహసీల్దార్ లక్ష్మి గ్రామ సభలు నిర్వహించారు. భూములు లాక్కొని అన్యాయం చేయవద్దని మూడు గ్రామాల సర్పంచ్‌లు నమ్మి నీరజ అప్పలరాజు, బర్ల శివ, బల్లిన అమ్మునాయుడు రైతు సంఘ నాయకులు బోయిన నారాయణమూర్తి, సేనాపతి నాయుడు, పల్లెల ఈశ్వరరావు, బాబూరావు, దేవర రాజు, అప్పారావు, తాతాజీ, చందక శ్రీను తదితర్లు ఈ సభల్లో తహసీల్దార్‌ను కోరారు. తాతల కాలం నుంచి భూములను దున్నుకుంటున్నా నేటికి సరైన భూ రికార్డులు మాకు లేవని మాకు న్యాయం చేయాలనుకుంటే ముందుగా మేం సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు అందించాలని కోరారు. బలవంతంగా భూ సేకరణ చేస్తే అడ్డుకుంటామన్నారు. రైతుల అభిప్రాయాలను జిల్లా అధికార్ల దృష్టి తీసుకెళతామని తహసీల్దార్ తెలిపారు.

డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ



కైలాసగిరి పోలీస్ మైదానంలో శిక్షణ పొందుతున్న పోలీసులు

ఆరిలోవ: నేరాల నియంత్రణలో డ్రోన్ టెక్నాలజీ వినియోగాన్ని పెంపొందించే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా పోలీసులు కీలక అడుగు వేశారు. కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో 25 మంది పోలీసులకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో మూడో విడత డ్రోన్ శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ బెండి వెంకటరావు పాల్గొని శిక్షణ పొందుతున్న పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తుల సమయంలో సహాయక చర్యలతో పాటు ఇతర పోలీస్ విధులను సమర్థవంతంగా నిర్వహించడానికి అత్యాధునిక డ్రోన్ కెమెరాల వినియోగంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ నేర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. దీని ద్వారా జూద కార్యక్రమాలు, బహిరంగ మద్యపానం వంటి వాటిపై నిఘా పెట్టవచ్చని, అలాగే శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. అసాంఘిక శక్తులను నియంత్రించడానికి డ్రోన్లను విస్తృతంగా వినియోగించనున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో జరిగే మోసపూరిత, అనుమానాస్పద కార్యకలాపాలను ముందుగానే గుర్తించడానికి డ్రోన్ల ద్వారా నిఘా పెడుతున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా చైన్‌స్నాచింగ్, ఈవ్ టీజింగ్ వంటి వాటిని నియంత్రించడానికి, రోడ్డు ప్రమాదాలను గుర్తించడానికి కూడా డ్రోన్‌లను వినియోగిస్తున్నామని ఆయన వివరించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జానకీరామరాజు, రమణారావు

అనకాపల్లి: వ్యాపారవేత్త, తూర్పుకాపు సంఘం మాజీ అధ్యక్షుడు దివంగత కోరుకొండ కాసులు(కాశి) ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు గాంధీబొమ్మ జంక్షన్ వద్ద నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. వీటిని కాసులు కుమారులు కోరుకొండ రమేష్, వైఎస్సార్‌సీపీ 84వ వార్డు ఇన్‌చార్జి రాఘవలు సమకూర్చారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్, కశింకోట ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ మలసాల రమణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో శుక్రవారం గౌరీపరమేశ్వరుల 206వ ఊంజల్ సేవ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని గౌరీపరమేశ్వరి అమృతవర్షిణి భక్తి బృందం ప్రతినిధి మద్దాల నాగశివ ఉమామహేశ్వరి దంపతులతో ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, సభ్యులు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, మళ్ల సురేష్, ఆళ్ల వెంకట సత్యప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

సేంద్రియ విధానంలో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



వీఏ, వీహెచ్‌ఏలకు శిక్షణ ఇస్తున్న అరుణ

కశింకోట: మండలంలోని సుందరయ్యపేట శివారు లాలంకొత్తూరులో మెగా ప్రకృతి వనరుల కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ వీఏ, వీహెచ్‌ఏలకు శుక్రవారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. బీజామృతం, ఘన జీవామృతం, కషాయాలు, విత్తన శుద్ధిపై అవగాహన కలిగిస్తూ శిక్షణ ఇచ్చారు. కేంద్రం నిర్వాహకురాలు, ట్రైనర్ కూండ్రపు అరుణ శిక్షణ నిర్వహించారు. రసాయనాలతో కాకుండా కషాయాలతో పంటలను సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సాధించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం జోనల్ అధికారి సుబ్రహ్మణ్యం, ఏవో స్వప్న, ఇన్‌చార్జి సింహాచలం, ఎల్1లు గంటి అప్పారావు, డి. రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలి



మడకపాలెంలో ఆందోళన చేస్తున్న ఉపాధి హామీ కార్మికులు

పరవాడ: ఉపాధిహామీ కార్మికుల బకాయి వేతనాలను వెంటనే చెల్లించి, ఆదుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మడకపాలెంలో పని ప్రదేశంలో బకాయి వేతనాల కోసం కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు 8 వారాలుగా వేతనాలు చెల్లించకపోవడంతో, కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు పని ప్రదేశంలో కల్పించాల్సిన కనీస సదుపాయాలను కల్పించట్లేదని ఆక్షేపించారు. ఏడాదికి 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లైవ్ ఆడిట్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కూలీలను వేధింపులకు గురి చేయడం మానుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు ప్రతి వారం వేతనాలు చెల్లించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో అమ్మాజి, భవాని, ధనలక్ష్మి, రాశి, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

బెల్టు షాపులు తొలగించాలంటూ గీత కార్మికుల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కల్లుగీత కార్మికులు

నర్సీపట్నం: బెల్టు షాపులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి దేముడు మాట్లాడుతూ గీత కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎక్కడపడితే అక్కడ బెల్టు షాపుల్లో మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మిస్తూ, గీత కార్మికుల పొట్టకొడుతున్నారని వాపోయారు. కల్లు అమ్మకాలు లేక గీత కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయన్నారు. వీధి వీధికి బెల్టుషాపులను పెట్టి కల్లుగీత వృత్తిని దారుణంగా దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అనధికారికంగా మూడు వేలకు పైగా బెల్టు షాపులు ఉన్నాయన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారుల అండదండలతో బెల్టు షాపుల నిర్వహణ జరుగుతోందన్నారు. బెల్టు షాపులు నడిపినా, షాపుల వెనుక రూమ్‌లు పెట్టి మద్యం అమ్మినా మద్యం షాపులు లైసెన్స్ రద్దు చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు చేసిన ప్రకటనలు ఆచరణలో అమలుకావడం లేదని. బెల్టుషాపులను నిరోధించి, కల్లుగీత కార్మికుల వృత్తిని బతికించాలని ఆయన డిమాండ్ చేశారు.